

అందిన ఉత్తరం

బాలసరస్వతీదేవి

నవంబరు నెల చివరిరోజులు రాత్రి తొమ్మిది గంటలు దాటింది ఆకాశం పూచిన పువ్వులా చందమామ వికసిస్తోంది వెన్నెల పరిమళం లోకమంతా కమ్ముకుంటోంది

వాళ్ళిద్దరూ ఆ వెన్నెల్లో తడుచుకుంటూ, ఒకరి ప్రక్కన ఒకరు అడుగులు వేసుకుంటూ మౌనంగా గోదావరి ఒడ్డున నడుస్తున్నారు ఆమె అతనికన్నా ఓ అడుగు ముందు నడుస్తోంది సన్నగా, బలహీనమైన శరీరం పొడుగాటి ముక్కు ఆ ముక్కు వెల మూడు వరహాలో, ముప్పయి పైసలో...ఎవరికి తెలీదు

అతను మాత్రం ఆమెని 'దేవత' అంటాడు...అనడు లోలోపల అనుకుంటాడు అనుకుంటూ ఆమెకేసి చూస్తాడు అతను చూస్తున్నట్టు, ఆమె 'చూస్తుంది'; లోలోన నవ్వుకుంటుంది

నాలుగడుగులు వేసి, నరమామిడి చెట్టు దాటి, పచ్చిక పరుపుమీదికి వచ్చిన తర్వాత—

ఆమె ఆగింది

అతను ఆగేడు.

మౌనం నిశ్శబ్దంగా నిలుచుని చూస్తోంది ఆమె అతనికేసి చూస్తోంది. ఆ చూపులో లక్ష ప్రశ్నలు వెయ్యి సందేహాలు...

"ఇక్కడ కూచుందాం..."

తలూపింది. తెల్లపవిట భుజాలచుట్టూ తిప్పుకుని, తెల్ల కాగితంలో చుట్టి విసిరేసిన మొన్నటి మల్లెదెండులా ముడుచుకుని కూచుంది ఆమెకి అడుగుదూరంలో అతను కూచున్నాడు వాళ్ళిద్దరి నీడలూ పడ్డచోట పచ్చిక ఆశగా చూస్తోంది...

"చలేస్తోంది..."

"అవును!" అన్నాడతను ఆమె కోసం ఆ చలినంతా మూటకట్టి బంగాళాఖాతంలోకి తన్నేయగల శక్తి తనకు లేనందుకు విచారిస్తున్నాడు

"మీరు ... చలికోటు తెచ్చుకో వలసింది..."

"నేను కోటు కప్పుకుని వెచ్చగా కబుర్లు చెబుతూంటే, నువ్వు చలికి వణుకుతూ ఒంటిగా కూచోవటం ఏం న్యాయం?"

"ఫర్వాలేదు చలిని భరించటం నాకు అలవాటే!"

"ఆ అలవాటు ఇంకా అయినట్టుగా లేదు ఈ కాస్త చల్లదనానికే నీ వొళ్ళు ఎలా కంపిస్తోన్నదో చూడు"

"కంపించటం కూడా నా వొంటికి అలవాటే!" అని పల్చగా నవ్వింది. చెట్టుమీదినుంచి రెండు తెల్లపూలు రాలి పడ్డాయి.

"ఇంకా నీకు ఏవేం అలవాటు?" అన్నాడు నవ్వుతూ

నవ్వింది!

అతను పచ్చికలో వెల్లకిలా పడుకుని, చేతులు తలకింద పెట్టుకుని...తదేకంగా ఆమెకేసి చూస్తున్నాడు...

"ఏవిటి?"

నవ్వేడు!

"పోసీ...మీ పేరు చెప్పండి, సర్దాగా!"

"వూహించు!"

"వేణు, గోపీ, ప్రసాద్, రాజు, శ్రీనివాస్, శశాంక ... లాంటి నూటొక్క పేర్లు చెప్పి, అలిసిపోయి...ఓడిపోయి ఒప్పేసుకుంది"

"నా పేరు చెప్పనా పోసీ?"

"తెలుసు!"

క్షణం వూరుకుని—"పది దినాలుగా

రోజూ అడుగుతున్నారుట...కదూ?" అంది

అడగటంకాదు. తనకోసం కొన్ని వందల మైళ్ళు ప్రయాణించేసి ... ఆత్రంగా పరిగెట్టుకు వచ్చేనంటే— "ఎందుకు?" అంటుంది ఏం చెబు తాడు? పోనీ చెప్పేస్తే? వద్దు తనెవరో ఆమెకి తెలియనవసరంలేదు

నవ్వి — "నిన్ను చూడాలని!" అన్నాడు.

"ఏవుంది నాలో?"

"నీకు తెలీదూ?"

తలొంచుకుంది వాలిన ఆ రెప్పల మీద వెన్నెల నీలంగా వెలుగుతోంది.

నది నగ్నంగా నిద్రిస్తోంది. చంద మామ అమాయకంగా ఆకాశంమీదినించి కిందికి చూస్తోంది.

ఏదో పిట్ట వికృతంగా అరుచుకుంటూ తలమీదినించి ఎగిరి వెళ్ళింది. జడుసు కుని—ఆమె అతనిమీద పడింది!

"భయవేసిందా...!

"నోరు లేని జీవులంటే నాకు భయం లేదు!"

"మరి, ఎవరంటే భయం?"

మౌనం

"నీకు మనుషులంటే కోపం కదూ.." అన్నాడు.

'మనుషులంటే నాకు కోపం అని ఎలా కనిపెట్టేసారండీ? మీతో ఏవన్నా కోపంగా మాట్లాడేనా కొంపతీసి?" అని నవ్వి—

"మీరు మనుషులేగా! మీ మీద నాకేం కోపంలేదు ఒట్టు!" అని తల మీద చెయ్యి పెట్టి నవ్వింది

"అందే — మరొకళ్ళమీద కోపం వున్నదన్న మాటేగా?"

"ఎవరో ఒకళ్ళమీద, ప్రతి ఒకళ్ళకి కోపం ఎప్పుడో ఒకప్పుడు వుంటూనే వుంటుంది పులిమీద లేడికి, పాము మీద కప్పకి కోపం ఎప్పుడూ వుంటుంది!"

"కాని మనుషుల్లో పులులూ ... పావులూ...వుండవు. మనిషి మనిషిని చంపితినడు!"

"తినడు! కాని, చంపుతాడు...! మీలాటివాళ్ళకి కనిపించని చావు రోజు రోజుకి ఛస్తూ ... క్షణం...క్షణం ... బతికే చావు..."

"ఎవరు, నిన్నింతగా హింసించిన ఆ దురదృష్టవంతుడు?"

గప్పున తలెత్తి చూసింది తొట్రు పడింది. తలొంచుకుంది.

ఆమె అతనికి అర్థమయింది. నిశ్శబ్దం...

నిద్రలో కదులుతోన్న నదీకన్య నిశ్వాసాల సవ్వడి.. భయ భక్తులతో వింజామరలు వీస్తోన్న చిరుగాలి రెప్పల చప్పుడు...

ఆమె—అతనికి తపోభంగం చేసింది
"ఏవిటి ఆలోచిస్తున్నారు ?"
"నీ గురించే ఇందాకటి నీ అంచనా ప్రకారం, నేను పులినా ? పామునా ? ఆ ?"
"రెండూ కాదు మనసున్న ఓ మనిషి !"
"నా మనసు గురించి నీ కప్పుడే ఎలా తెలిసిపోయిందబ్బా ?"
"నాకు మనసుల్ని చదవటం చేత నవుతుందబ్బా !" అని గలగలా నవ్వింది
"అబద్ధాలు !" అన్నాడు దబాయింపుగా "నా గురించి నీకు రవంత కూడా తెలీదు !"
"ఎందుకు తెలీదు ? మీ ఎత్తు ఐదడుగుల పదంగుళాలు బరువు సుమారు నూట యాభై పౌన్లు క్రెరటాల్లా క్రాపూ...కలలు కాచేట్టు కళ్ళూ...ఈ కళ్ళు అమ్మాయిల మనసుల్ని యాతన పెట్టేస్తాయి ఎడ్వంచర్స్ అంటే ఇష్టం ఆడపిల్లలతో అపరాత్రి గోదావరి గట్టున కూచుని కబుర్లాడటం సర్దా చాలా ? ఇంకా చెప్పేయనా ?"
"నే చెబుతాను అనగా అనగా ఓ వూళ్ళో ఒక అమ్మాయి అందాల బొమ్మ ఆ అమ్మాయిని ఓ అబ్బాయి చూసేడు అబ్బాయిని అమ్మాయి చూసింది. అతను నవ్వేడు ఆమె సిగ్గుపడి పారిపోయింది తర్వాత, రోజూ అతను ఆమెకి కనిపిస్తాడు నవ్వుతా ఆమెకి భయం, ఎవరన్నా చూస్తార బెదురుగా, భయంగా చుట్టూ చూస్తుం ఆమె భయాన్ని అతను గ్రహిస్తా పర్వాలేదన్నట్లు పల్చగా నవ్వి—క తోనే ఆమెకి ధైర్యం చెబుతాడు

ఒకరోజు అక్కో ... ఎవ చూసేరు కూకలు వేసేరు ఆమె భ పడిపోయింది అతనికి కనిపించట మానేసింది అతనికి కనబడకుండా కిటికీలోనించో చాటుగా అతని చూస్తుంది అతను దిగులుగా, ఆశగా.. గుమ్మంకేసి చూస్తాడు శూన్యం చూస్తుంది తల దించుకుని, భారం అడుగులు వేసుకుంటూ అక్కణ్ణిం వెళ్ళిపోతాడు ఆమె గుండె పగులుతుంది పరుపుమీద పడి, అవురుమని ఏడ్చుకుంటుంది...

అతను పిచ్చివాడిలా ఐపోయాడు గడ్డం మాసింది దుస్తులు మాసేయి నవ్వు మాయమయింది

ఆమెకి ఆమె పెద్దలు వేరొకరితో వివాహం చేయడానికి నిశ్చయం చేస్తున్నారు...

ఈ సంగతి అతనికి తెలిసింది గుండె పగిలింది ఎలాగో ఆమెకి ఓ కబురు పంపేడు సాయంకాలం, ఆలయం వెనుక తోటలోకి రావాలి..."
"అమ్మో.. !" అనుకుని, వణికింది.

ఏడ్చుకుంది. చివరికి తనకి తాను ధైర్యం చెప్పుకుని—బయలుదేరి వెళ్ళింది.

అతనికి కోపం బాధ. ఎంత సేపటికీ మాట్లాడడు చివరికి ఆమె ఏడ్చేసింది. అతను కరిగిపోయేడు.

"...ఏదో ఇంత చదువుకుని నా మానాన నేను బతుకుతోన్న సామాన్యుణ్ణి నేను. నన్ను నీ చూపులతో కవ్వించి, కవ్వించి, మతి పోగొట్టి శలభంలా నీ చుట్టూ తిప్పుకున్నావ్. నీ అగ్నిజ్వాల నన్నేవిధంగా మార్చి పారేసిందో చూడు. అమాయకుణ్ణయిన నన్నెందుకిలా వుద్రేకపరిచావ్? ఇప్పుడెందుకిలా దూరమైపోతున్నావ్? మీవాళ్ళు నీకు వేరే సంబంధాలు చూస్తున్నారని తెలిసింది. మన పెళ్ళికి మీ ఇంట్లో ఎలానూ ఒప్పుకోరు. వెళ్ళిపోయి, రహస్యంగా వివాహం చేసుకుందాం..." అన్నాడు

ఆమె తలొంచుకుంది. మాట్లాడదు.

"అలా మౌనంగానే ఇన్నాళ్ళూ నన్ను ఏడిపించి చిత్రవధ చేసేవ్. ఇక వూరుకునేది లేదు చెప్పు! నన్ను వివాహం చేసుకోవడం నీకు ఇష్టమా? కాదా?" అన్నాడు గట్టిగానే. ఆమె తలొంచుకుని ఏడ్చింది.

"నువ్వు ఏడుస్తున్నావ్..! నన్ను ఏడిపిస్తున్నావ్...! నీ కిష్టంలేదూ, చెప్పు! వెళ్ళిపోతాను. ఇక కన్పించే కాదు. శాశ్వతంగా ఈ లోకంనించి..." అన్నాడు

ఆమె వావురుమంది. వణికిపోతూ... అతన్ని కావిలించుకొని ఏడ్చింది!...

తర్వాత, ఇద్దరూ ఎన్నో కబుర్లు చెప్పుకున్నారు సపధాలు చేసుకున్నారు.

—ఒకరోజు రాత్రి ఇద్దరూ కలిసి రహస్యంగా వెళ్ళిపోవడానికి నిశ్చయం చేసుకున్నారు...

"వొద్దు.. వొద్దు...చెప్పొద్దు!" అంటూ అరిచిందామె మోకాళ్ళతో తలుంచుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది

అతడు ఆగిపోయి, ఆశ్చర్యంగా ఆమెకేసి చూసేడు

"నీలూ..." అన్నాడు ఆర్ద్రంగా

గప్పున తలెత్తింది. కళ్ళు జ్వలించేయి. "ఎవరు మీరు?"

'ఎవరో' అతను చెప్పలేదు. చెప్పవలసిన సమయమూ కాదు

"ప్రపంచంలో...నన్ను నీలూ అని పిలిచేవాళ్ళు ఒకే ఒక్కరు వున్నారు. ఆ ఒక్కరూ...మీరు కాదని తెలుస్తూనే వుంది. మరి, ఎవరు మీరు...? ఎందుకొచ్చేరు? ఎందుకు...నన్నిలా చిత్రవధ చేస్తున్నారు...?" ఏడుస్తోంది.

ఏమని చెబుతాడు? 'ఎవర్నని' చెబుతాడు? అసలు ఏముంది చెప్పడానికి...?...

"ప్లీజ్...నీలూ..." అన్నాడు. తలమీద చెయ్యి వేసేడు.

పవిట చెంగుతో కళ్ళు వత్తుకుంది. నిన్న పూచి రాలిన పువ్వులా...చూపు..

"మధు బాగున్నాడా...?"

అతను ఓ గుటక వేసేడు? "మధుని నువ్వింకా మర్చిపోలేదా...?"

"లేడి, పులిని మర్చిపోతుందా... ఎక్కడున్నా ?" అని నవ్వి- ఆ నవ్వులో విషాదానికి వెన్నెల చెమ్మగిల్లి...చలిగాలి జాలి కళ్ళతో దిగులుగా వీస్తోంది —

"మధు ... స్నేహితుడా ? చూసి రమ్మన్నాడా సర్దాగా ?"

"నిజంగా, 'మధు' ఎవరో నాకు తెలీదమ్మా ?"

"తెలీదూ ?" అంది తీక్షణంగా ఆ చూపు అతన్ని చీల్చింది

"నిజం నీలూ...మీ వూళ్ళో అప్పుడు నా ఫ్రెండు ఒకడు వుండేవాడు అప్పుడప్పుడు అక్కడికి వచ్చినప్పుడు, నిన్ను చూసేవాణ్ణి దాన్నాళ్ళ తర్వాత, ఓ సారెప్పుడో మాటల సందర్భంలో...నీ ప్రస్తావన వచ్చి నువ్వు కనబడటం లేదేవని అడిగితే...నువ్వు 'మధూ' అనే అతనితో వెళ్ళిపోయేవనీ...మీ ఇద్దరూ పారిపోయి వివాహం చేసుకున్నారనీ నా మిత్రుడు చెప్పేడు ఏమయింది ? మధూ నీ కూడా రాలేదా...?"

తలొంచుకుంది...కంటినించి ఓ నీటి బొట్టు రాలింది...

* * *

రాజు వర్ధమాన రచయిత. సాహిత్యానికి శ్రీకారం చుట్టి పట్టుమని నాలుగేళ్ళు కాలేదు అప్పుడే రచయితగా మంచి పేరొచ్చింది అతని కథలు ఐదారు సంపుటాలుగా ప్రింటయి వెలుగులోకి వచ్చేయి పేరున్న ఓ వారపత్రికలో అతను వ్రాసిన ఓ క్రొత్తనవల సీరియల్‌గా వస్తూ అసంఖ్యాకమైన పాఠకుల అభిమానాన్ని చూరగొంటోంది.

తన పాఠకులంటే అతనికి పిచ్చి ప్రేమ. రోజూ ఆఫీసునుంచి రాగానే కాఫీ తాగి, గార్డెన్‌లో సిమెంటు బెంచీమీద ఒంటిగా కూచుని అభిమానుల వుత్తరాలు చదువుకోవడం--అతని దినచర్యలో ఓ భాగం

ఆ రోజు పోస్టులో నీలంరంగులోవున్న ఓ కవరు అతన్ని అమితంగా ఆకర్షించింది మిగతా వుత్తరాలన్నీ పక్కన పెట్టి, కవరు ఓపెన్ చేసేడు అందులోనుంచి లేత నీలంరంగులో వున్న ఓ కాగితం కిందపడింది

రాజుగారికి !

నమస్తే ! మీరలా కాగితాలు వెనక్కి తిప్పేసి, పేరు చూసేసి, "ఎవరీ నీలా సుందరి ?" అంటూ బుర్ర గోక్కోనవసరంలేదు నా పేరు 'నీలూ' 'సుందరిని' మాత్రం కాదు. కానందుకు విచారమూ లేదు కాకపోతే మీ కథలంటే ప్రాణం అవాల్టికి అన్నం మానేసన్నా ఆ డబ్బుతో మీ పుస్తకం కొనుక్కుని చదివేస్తాను కడుపు నిండిపోతుంది 'కోస్తోంది' అని నవ్వుకుంటున్నారు కదూ ? అమ్మ బాబోయ్ ! ఎలా కని

పెట్టేసేరు ! నిజమే ఇప్పటిదాకా వంకాయలు కోసొచ్చేను గుత్తొంకాయ కూరంటే నాకు ప్రాణం మీకో ?

మర్చిపోయేను మొన్న పత్రికలో మీ ఫోటో చూసేను నవ్వలేక చచ్చేను—! ఒట్టు నేనింకా మీ వయసును ఏభైకి కొంత అటూ – ఇటూగా వుంటుందని వూహించుకున్నాను ఇంతింత మీసాలతో...పంచకట్టుతో... చూడగానే జడుసుకునేంత గంభీరంగా వుంటారని కూడా అనుకున్నాను మా వూళ్ళో ఓ హాస్యరచయితవున్నాడు చూస్తే,కరుస్తాడు మీరేమో...వుంగరాల జుట్టుతో, తెల్ల బుష్ షర్టుతో ఫోటోలో నించుని నవ్వేస్తున్నారు...! మొన్న మా వీధిలో ఓ అబ్బాయిని చూసేను అచ్చం మీలానే వున్నాడు మీరేనా ? ఓ వేళ మీరు ఎక్కడన్నా కనపడ్డా—పరకపోయినా సరే, మిమ్మల్ని అనవాలు పట్టలేనేమో ! పత్రికలో చూసేననుకోండి. ఫోటోలో వున్నట్టే నిజంగాకూడా వుంటారన్న గ్యారంటీ ఏవిటి ?

అసలు సంగతి ఏవిటంటే-నిన్న మీ 'కల్యాణి' చూసేను ! కథలో కల్యాణి పరిస్థితుల ప్రాబల్యంవలన 'పతిత' అవుతుంది ఒకరోజున ఆమెని ఓ యువకుడు చూసేడు అతని ఒళ్లు ఝల్లుమంది. ఆమెని శాపవశాత్తూ భూలోకంలో జన్మించిన దేవతగా భావించుకున్నాడు ! (దేవతలు శాపంకొట్టి భూలోకానికి వస్తుంటారన్న రహస్యం నాకు తెలిసింది కొంపతీసి, నేనుకూడా అలాంటి దేవతను కాదుకదా ?) ఎంత వరకూ వచ్చేం ? ఆ ! అతను కల్యాణిని దేవతగా భావించుకున్నాడు 'ప్రేమించేడు' ! ఈ సంగతి ఆమెతో చెప్పేడు కల్యాణి ఒప్పుకుంది (ప్రేమించడానికి కాదు ఇద్దరూ కలిసి, గుట్టుచప్పుడు కాకుండా (?) గుళ్లో పెళ్లి చేసేసుకున్నారు !...

ఎవరండీ ఆ యువకుడు.. ? ప్లీజ్ ! చెప్పరూ ? వూరికే వెళ్లి అభినందించి వచ్చేద్దాం అని మన్లో మనమాట మీరు చేసుకోగలరా కల్యాణిని ? ఏం పాపం? యువకులేగా ? వివాహం కాలేదుగా ? కోపం వస్తోందా...? రానీయండి లేకపోతే, ఈ కాకమ్మ కథలు రాయడం ఎందుకు ? ఎవర్ని వుద్ధరించడానికి ? పరమాన్నం తింటూ పేదల ఆకలి పేగుల గురించి రాసేవాళ్లూ...పతివ్రతలైన పెళ్లాలని పెట్టుకుని పతితల బతుకుల గురించి గుండెలు బాదుకునేవాళ్లూ అంటే అసహ్యం నాకు. మీరు చేయలేని ధైర్యాన్ని ఎడ్వెంచర్ నీ ఎవరో చేయాలి ఆ 'ఎవరో' ఈ సమాజంనించే నడుం చుట్టు తువాలు బిగించుకుని ముందుకు వురకాలని మీ వుద్దేశ్యం మీలాటి 'ఎస్కేపిట్టలకి' కథలురాసే అర్హతలేదు కనీసం 'కల్యాణి' లాటివి దయచేసి ఇకముందు ఇలాటి పిచ్చి కథలు రాయకండి. రాజు

మంచి రచయిత శక్తిగల రచయిత ఆ శక్తే నన్ను బంధించి, మీ అభిమానిగా చేసిపడేసింది. ఆ అభిమానం దెబ్బ తినకుండా కాపాడుకునే బాధ్యత మీ మీద వుంది మీ బాధ్యతని మీరు మర్చిపోరు కదూ ?

మర్చిపోయినా.. పోకున్నా...ఎప్పుడన్నా మీకు వుత్తరాలు రాస్తూనే వుంటాను కాని.. తిరిగి మీవద్దనించి జవాబులు అందుకునే 'అర్హత' నాకు లేదు. ఇంతకన్నా వివరించి చెప్పగల శక్తి లేదు క్షమిస్తారు కదూ ?

మీ అభిమాన పాఠకురాలు

నీలా

క్రింద అడ్రసులేదు పూరు పేరు లేదు. కవరు వెనక్కి తిప్పి, పోస్టల్ ముద్ర చూసేడు 'రాజమండ్రి' అని వుంది తిరిగి వుత్తరాన్ని మొదటినించి చివరివరకు చదివేడు మళ్లీ చదువు కున్నాడు

పాఠకుల దగ్గర్నించి వుత్తరాలు రావడం అతనికి క్రొత్తకాదు. రోజూ ఎవరో ఒకరి దగ్గర్నించి ఒకటి రెండు వుత్తరాలు వస్తూనే వుంటాయి. పాఠకుల వుత్తరాలకి జవాబులు రాయడం తమ 'స్టేటస్'కి భంగం అనుకునే 'స్టేజి'కి ఇంకా రాలేదు కనుక, వెంటవెంటనే అందరికీ సమాధానాలు రాసేస్తూ వుంటాడు.

స్త్రీ పాఠకులు కూడా అప్పుడప్పుడు రాస్తుంటారు. వ్రాసినవాళ్లయినా కథ బాగోగుల గురించి రాస్తూ..."ప్లీజ్ ! జవాబు రాయరూ...?" అంటూ అభ్యర్థిస్తారేగాని, ఇలా వూరూ పేరూ లేకుండా ఇంత చలాకీగా, ఇంత ఘాటుగా, "మీరైతే కల్యాణిని పెళ్ళిచేసుకోగలరా ?" అంటూ సవాల్ చేసి చెవిమెలిపెట్టగల పాఠకురాలు అతని జీవితంలో తగల్లేదు.

వెనక్కి జారగిలబడి, కళ్లుమూసుకుని-"ఎవరీ నీలా ?" అంటూ ఆలోచించటం మొదలుపెట్టేడు. సామాన్యంగా పాఠకుల జీవితాలకి దగ్గిరగా వుండే పాత్రలే వాళ్లలో వుద్రేకాన్ని కలుగజేసి కలవరపడేలా చేస్తాయి. తను ఇంతవరకు వంద కథలు రాసేడు. దాదాపు వాటన్నిటినీ చదివివుంటుందని ఆమె వుత్తరాన్నిబట్టి తెలుస్తోంది కాని, ఆమెని 'కదిపింది' కల్యాణి మాత్రమే !

నీలా లేఖలో మూడవ వాక్యం--"అవాల్టికి అన్నం మానేస్తున్నా ఆ డబ్బుతో మీ పుస్తకం కొనుక్కుని చదువుతాను..."; అంటే తన తిండి తాను సంపాదించుకుని, తన బ్రతుకు తాను బ్రతకవలిసిన స్థితిలో వుందన్న మాట. ఆ స్థితికూడా—అన్నం మానేస్తే తప్ప అర్ధరూపాయిపెట్టి ఓ పుస్తకం కొనుక్కోలేని హీనస్థితి—! ఆదుకునేందుకు నీలాకి అమ్మా, నాన్నా లేరు, 'భర్త' లేదు అవివాహిత...

"ఇంతకన్నా వివరించి చెప్పగల శక్తి నాకు లేదు!" అంది నీలా కితన జీవితం గురించి చెప్పుకోవటం ఇష్టం లేదు ఆలా చెప్పుకోవడానికి సంకోచ పడే జీవితం' అయి వుండాలి ఓ అపరి చితుణ్ణి పట్టుకుని- "మీరైతే అంత సాహసం చెయ్యగలరా!" అంటూ వుద్రేకపడిందంటే, అలా చెయ్యలేని వాళ్లమీద 'తనకి' కోపం. ఆ కోపా న్నించి జనించిన వేదనతోనే ..ఇన్నా ళ్లుగా తాను అజ్ఞాతంగా అభిమానించి ఆరాధిస్తోన్న రచయితకి 'తిడుతూ' వుత్తరం రాసింది. ఇంత రాసినా తన అడ్రసు ఇవ్వడానికి ఇష్టపడలేదు ఇస్తే, తాను దాచుకున్నది వెల్లడయి పోతుందని భయం...! సమాజం తనని వెలివేసి, వేలెత్తి చూపుతోంది కనుక... ఆ సమాజంలోనే ఒకడైన రాజుకూడా తనని హీనంగా చూసి, అసహ్యించు కుంటాడని...భీతి!

ఓవేళ, నీలా నిజంగా 'అలాంటి' స్త్రీయే ఐతే- ఈమెలో ఇంత వుత్తమో త్తమ సంస్కారం, నిశితదృష్టి...ఇంత చక్కటి శైలితో వుత్తరాలు రాయగల నేర్పు ఎలా వచ్చేయి? బాగా చదువూ, వివేకం వున్న యువతి అయివుండాలి. పరిస్థితుల ప్రాబల్యంవల్ల రెల్లుపూవులా ప్రిదివి...ప్రవాహ వేగంతో కొట్టుకు పోతోంది...

—నీలాని ఇంత హీనస్థితికి దిగ జార్చిన 'పరిస్థితులు' ఏమైవుంటాయి? ఆలోచనలతో అతనికి ఆ రాత్రంతా నిద్రపట్టలేదు

నాలుగురోజుల తర్వాత మరో వుత్తరం వచ్చింది అచ్చు ముందురాసిన వుత్తరంలాగే వుంది అతని కథలన్ని టినీ పేరుపేరునా ఎత్తి, విమర్శించింది తర్వాత, మరొకటి. అలా—అలా... సీరియల్‌గా వుత్తరాలు రావటం మొదలు పెట్టేయి. ఒక్క వుత్తరంలోనూ అడ్రసు ఇవ్వదు.

ఇలా ఆర్నెల్లు గడిచేయి

అతనికి మతి పోతోంది

మనసు_ఈ నీలా అనే అమ్మాయి మీదికి పిచ్చిగా పోతోంది ఈ నీలా ఎవరో తెలుసుకుంటే తప్ప, నిద్రపట్టని స్థితి వచ్చేసింది.

ఆఫీసుకు పది దినాలు సెలవు పారేసి రాజమండ్రి బయలుదేరేడు తను చేస్తు న్నది ఏమిటో...ఏం చేయాలనుకుంటు న్నాడో తనకే సరిగాతెలీదు రాజమండ్రి లాటి పట్టణంలో ముక్కూ ముఖం తెలీని ఓ అమ్మాయిపేరు పుచ్చుకుని వెదక డానికి బయలుదేరడం ఎంత హాస్యా స్పదమో...ఎవరన్నా వింటే ఎంత నవ్వుతారో తనకి తెలుసు కాని...ఏదో ఆశ. నీలా నిజంగా అలాంటి స్త్రీయే ఐతే 'అలాటి' వాళ్లు వుండే ప్రదేశాలు కొన్ని వున్నాయి. 'వాళ్లలో' ఇంత మధురమైన పేరూ, రచనలమీద ఇంత ఆసక్తి వున్నవాళ్లు అరుదు. నీలా తప్ప

కుండా కనిపిస్తుంది కనిపిస్తుందని ఏదో అదృశ్యశక్తి తన వెన్నుతట్టి చెబుతోంది...

ఓవేళ నీలా నిజంగా కనిపిస్తే, ఏం చేస్తాడు? తనని తాను పరిచయం చేసుకుంటాడా? అవసరంలేదు పత్రికలో చూసింది కనుక, ఆనవాలు పడుతుంది పట్టి, ఆనందం పట్టలేక ఏడ్చేస్తుందా? లేక, ఆమె మొహం తనకి చూపలేక వెనక్కి తిరిగి పారిపోతుందా?...

ఒకవేళ — తనని మామూలుగా ఆహ్వానించి, కబుర్లుచెప్పి — "ఎందుకు వచ్చేరు రాజు బాబూ?" అంటే, ఏవంటాడు? "నిన్ను చూసేందుకు వచ్చేను నీలా..." అంటాడా? ఎందుకు చూడటం? తను చూసినందువల్ల నీలాకి ఒరిగేది ఏముంది?

రాజమండ్రిలో అతనికి ఓ మిత్రుడున్నాడు. కనిపించినప్పుడల్లా ఒకసారి వచ్చి తమ వూరుని పావనం చెయ్యమని కోరుతున్నాడు బ్రహ్మచారి వెధవ కనుక, నాలుగు రోజులు వాడిదగ్గర కాపురం పెట్టేసినా ఏడ్చుకోడు.

ముందుగా చెలిగ్రాం కొడితే, హడిలి చస్తాడని రాజమండ్రీ పురవీధుల్లో లెఫ్ట్ రైట్ కొట్టుకుంటూ మధ్యాహ్నం మూడు గంటలకి అంతఃపురానికి వచ్చిపడ్డాడు.

సారధి కొంపలోనే వున్నాడు

అద్దంముందు నించుని క్రాపుదువ్వుకుంటున్నవాడల్లా కెవ్వున కావిలించుకుని, మంచంలో కూలేసి—"నిజం చెప్పు! ఇదంతా నామీద ప్రేమే?"

"నీ మీద వొట్టు!"

"నమ్ముతున్నాలేగాని, ఇడియట్. ఏంతింటున్నావ్? బుగ్గలొచ్చేస్తున్నాయ్ ఆడపిల్లలా."

"చెబితే, మీ రాజమండ్రీ అమ్మాయిలంతా అమాంతంబుగ్గలు పెంచేసి నీలాటి బ్రహ్మచారిగాడి ప్రాణాలు లాగేస్తూ ఏడిపించుకు తినేస్తారు. ఆ పాపం నాకు చుట్టుకుంటుంది"

"నా పాపం పారూకి ఎలానూ చుట్టుకుంటుంది."

"పారూ ఎవరమ్మా?" అన్నాడు ముదుగా

"ఓ ముద్దుగుమ్మ..."

"యాపిల్ బుగ్గలుంటాయా?"

"రెండు జడలుకూడా వుంటాయి మన్లోమనమాట. ఇంచక్కా వుంటాయి!"

"అమ్మ బాబోయ్! ఇదంతా ప్రేమే!"

"ఒట్టు పెళ్ళిపెద్దవి నువ్వే!"

"ఐతే, పారూని చూపించవూ—?" అంటూ బతిమాలుకున్నాడు

"చూపిస్తే ఏమిస్తావ్?"

"నీ పెళ్ళికి ఏదన్నా కానిస్తాలే!"

"సరే!" అని ఆ సాయంకాలం చూపించేడు దేవీచౌక్ పక్కనించి వస్తోంది. కోలముఖం. పాలమీగడలా

వుంది సారథిని చూసి నవ్వి, రాజుని చూసి కంగారుగా తలొంచుకుంది

"దుర్మార్గుడా! పరిచయం చెయ్యవేం?"

"చంపేవ్ పో నాకే ఇంకా పరిచయం కాలేదు"

'వన్ వే ట్రాఫిక్కా!"

"చూసేవ్‌గా నవ్వింది!"

రాజు చూసేడు అదే సమయంలో పారూ వెనక్కి తిరిగి, రాజుకేసి చూసి బెదిరిపోయి తల తిప్పేసుకుంది

రాజుకు నవ్వొచ్చింది "నీ ప్రేయసి వుత్త పిరికిపిల్లరా"

"పెళ్లాలు అయేవరకు ప్రేయసీలు అలాగే వుంటారులే తర్వాత తెలుస్తుంది"

"తెలుసుకోవాలని నీకు బాగా కంగారుగా వున్నట్టుంది వాళ్ళింటికెళ్ళి మాట్లాడనా పాపం..."

"అంతపని చేసేవంటే నిన్నిపళంగా తన్నేసి రైలెక్కించేస్తాను లౌమేరేజి చేసుకోవాలని నా జీవితలక్ష్యం."

"నా కిపూటకి తిండి తగలేయించటం కూడా నీ జీవితంలో ఓ లక్ష్యంగా చేసుకో టైమెంతయింది?"

బాగానే అయింది, హోటల్లో భోంచేసి సెకండ్ షో ఓ చెత్త ఫిలిం చూసి, చూస్తేక మూడో రీలులో లేచిపోయి - లేచిపోవడం ఇంటికి, పదినిమిషాల్లో పరువులో వాలిపోయి నిద్రలో పడ్డారు

మర్నాడు లేచేసరికి తొమ్మిదయింది ఆ రోజంతా ఇద్దరూ కలిసి రాజమండ్రి అంతా తిరిగేరు రాజు మనసు నీలూ చుట్టూ తిరుగుతోంది. సారథి రాజుని కావిలించుకుని తిరుగుతున్నాడు వీణ్ణి వదిలించుకుని నీలూని అన్వేషించడం ఎలా?

సారథి 'హీరో'యే కాని, నీలూ గురించి చెప్పటం ఇష్టంలేదు. తనెవరో నీలూకి తెలియకుండా, ఆమెను చూసి వెళ్ళిపోవాలి

ఎలా? ఎలాగబ్బా?

నిజంగా సారథి 'అబ్బ' - రాజు పాలిటి శ్రీకృష్ణుడిలా అడ్డుపడి, సారథికి లీవ్ ఇవ్వకుండా చక్రం అడ్డేసేడు

సారథి ఏడుపుముఖం పెట్టేసేడు ఓ పూటంతా రాజుని తినేసి వాళ్ల ఆఫీసరుమీద ఓ కథ రాయించి పోస్టుచేసి కసి తీర్చుకున్నాడు.

మర్నాడు సారథి కృష్ణశాస్త్రి విరహగీతం పాడుకుంటూ నైట్ డ్యూటీకి వెళ్ళింతర్వాత, రాజు రూంకి తాళంవేసి బయటికి వచ్చి మెల్లగా నడవటం మొదలుపెట్టేడు

రాత్రి ఎనిమిది గంటలు దాటింది. దీపాలకాంతిలో వూరు వెలుగుతోంది జనం పాక్కుంటూ పోతున్నారు. తెల్లచీరకట్టుకున్న ఓ అమ్మాయి... తలొంచుకుని దిగులుగా నడుచుకుంటూ

పోతోంది. కదివితే, ఓ కన్నీటి కావ్యం అవుతుందేమో...

చాలా సేపు సెంటర్లో తచ్చాడి, కొంత రాత్రి అయింతర్వాత ఆ వీధిచివరికి వచ్చి క్రీనీడలో నేరేడు చెట్టుకింద నించున్నాడు. నక్షత్రాలు ఆకాశంమీదినించి ఆత్రంగా కిందికి చూస్తున్నాయి.

నలుగురైదుగురు స్త్రీలు ముస్తాబు చేసుకుని చిట్లిన చేమంతి పూలలా ఇటూ అటూ తిరుగుతున్నారు. కొందరు కబుర్లు చెప్పుకుంటున్నారు కొందరు గుంపుగా కూచుని ఏవో అనుకుంటూ పెద్దగా నవ్వుకుంటున్నారు. ఏ యువతిని చూసినా నీలాలాగే కనిపిస్తోంది ఓ అమ్మాయి, ఎర్రచీరతో...మంటల్లో నించున్న మంచుబొమ్మలా దీనంగా చూస్తోంది నీలాయేనా...నీలాయేనా..

నిజంగా నీలా ఇలాంటి స్త్రీ కాదేమో! తను పొరపాటు పడుతున్నాడేమో .?

ఎవడో వచ్చేడు

గళ్లలుంగీ ... గారపళ్లూ ... కళ్లలో కళ్ళుపెట్టి తూలుతూ ఏదో వాగుతున్నాడు రాజుకి గొంతు పొడారిపోయినట్లుగా అయింది. వాడి భావం అర్థమయింది

కాని...ఎలా ? ఏమని అడగటం.. ? ...చివరికి అడిగాడు -- "ఇక్కడ అందరూ తెలుసా నీకు ?"

"జెర్లో నీళ్లకి చేపల గురించి తెలీక పోవచ్చునుగానీ బాబూ, ఇక్కడున్న పెతి ఆడదాని జాతకం మనకి వాల్ రైట్‌గా తెలుసు..."

"నీలా తెలుసా?" అన్నాడు గబ్బున. గుండె గబగబా కొట్టుకుంటోంది

వాడు బుర్రగోక్కుని ఆకాశంలోకి చూసేడు. మళ్ళీ తలదించి అతనికేసి చూసేడు మళ్లీ బుర్రగోక్కున్నాడు.

వాడి తీరు చూస్తుంటే ... నీలా లేదేమో, అసలు అలాంటిది కాదేమో అన్న అనుమానం వచ్చి ఆనందంలాంటి 'రిలీఫ్' కలుగుతోంది

"నీలా పేరెవర్లకీ లేదు బాబూ..."

"పోనీ నీలాసుందరి, నీలమ్మ... నీలవేణి...నీలమణి..."

"ఆ...ఆ...వున్నాది నీలమణి వున్నాది."

అతని ఒళ్లు జల్లుమంది. ఆకాశం మీదినించి ఓ వుల్క రాలిపడింది.

"నేను, నీలా ... నీలమణితో మాట్లాడాలి."

"యీలపదు బాబూ అది సేటుతో టూరింగ్‌కి పోనాది. నాల్గురోజులదాకా రాదు. దానికన్నా మంచి పిల్లలు, సినిమాస్టార్లలాగున్నోళ్లు..."

"వొద్దు. నీలమణి వచ్చింతర్వాత చెప్పు. నేను రోజూ ఈ టైంకి వచ్చి ఆ కిళ్ళీ కొట్టుదగ్గిర నుంచుంటాను" అని పర్సులోనించి పదిరూపాయిలనోటుతీసి చేతిలో పెట్టేడు.

చిత్రంగా చూసి—తలూపుకుంటూ లొల్లాయిపదం పాడుకుంటూ పోతున్నాడు

"ఇదిగో!" అన్నాడు

దొర్లుకుంటూ వచ్చి, నమ్మినబంటులా నుంచున్నాడు.

"నీలా...నీలమణి ఎలావుంటుంది?"

వాడు బుర్రగోక్కుని ఆకాశంలోకి చూసేడు మళ్ళీ తలదించి అతనికేసి చూసేడు మళ్ళీ బుర్రగోక్కున్నాడు

"ఎలాగుంటుందంటే...అందవా! ? సిన్మా స్టార్లాగుంటుంది"

"అదికాదు వయసు?"

"ఏం. పాతికుండదూ?"

పాతిక? నీలా వయసును తను పాతిక్కి కొంత అటూ యిటూగానే వూహించుకున్నాడు అందంగా వుంటుందనికూడా అనుకున్నాడు.

ఇంటికొచ్చి ఎలాగో డ్రెస్ మార్చుకుని పరుపుమీద వాలిపోయేడు నాలుగు దినాలూ నాలుగు అంతులేని దీర్ఘరాత్రులుగా వూహించుకుంటున్నాడు...

ఈ నీలా ఎవతైతే నాకేం? ఎలాటి బ్రతుకు బ్రతుకుతూంటే నాకేం? ఆమెకీ నాకూ ఏవిటి సంబంధం? ముక్కూ ముఖం తెలీని ఓ పారకురాలికోసం ఎందుకు తనకీ తాపత్రయం...అనవసరపు వ్యర్థప్రయాస అని అనుకోలేక పోతున్నాడు

అతను మనిషి. ఇంకా లోలోతులకి వెళ్లి నీలాలోని 'నీలా'ని తెలుసుకోవాలన్న తపన. ఎప్పుడు నిద్ర పట్టిందో తనకే తెలీదు

నాలుగు రోజులూ నాలుగు దీర్ఘరోగుల్లా నడచి వెళ్లేయి

'వాడు' వచ్చేడు, 'నీలా' రాలేదు

అతనికి దిగులేసింది బాధనిపించింది బరువుగా అడుగులు వేసుకుంటూ అక్కణ్ణించి కదిలిపోయేడు

మరో రెండు రోజులు గడిచేయి...

మళ్లీ - మూడు దినాలు

అతనికి విసుగొచ్చింది కోపం వచ్చింది

అక్కణ్ణించి వెళ్లిపోవాలనుకున్నాడు-

ఇంత శ్రమపడి...ఇన్నాళ్లు నిరీక్షించి చివరికి, నీలాని చూడకుండా వెళ్లిపోవడమా..? వీల్లేదు

పదవనాడు రాత్రి 'వాడు' పరుగులు పెట్టుకుంటూ వచ్చేడు

అతన్ని ఓ పెంకుటింట్లోకి తీసుకు వెళ్లేడు అతనికి ఎలాగో వుంది. గుండె భావాలకి అతీతమైన భావంతో... స్పందిస్తోంది...

లాంతరు వెలుగుతో...నలిగిన నీలంచీరతో...

నీలా...నీలా...

—నీలాయేనా?

నవ్వి - "రండి.." అంది చూపుతో

అతనిలో ఎక్కడో ఏదో తెగింది నిలబడలేనట్టుగ కుర్చీలో కూలబడ్డాడు.

గూట్లో దీపం దిగులుగా చూస్తోంది

ఆమె అతన్ని ఆనవాలు పట్టినట్లుగా లేదు నిజమే పత్రికలోని తనఫోటో నాలుగైదేళ్ళ క్రితం నాటిది అప్పటికీ ఇప్పటికీ బాగా మారేడు

కళ్ళలోకి చూసి...పల్చగా నవ్వింది

"ఏమి"టన్నట్లు చూసేడు

"ఏం లేదు" అన్నట్లు తలతిప్పింది ఎవరో బలవంతాన రాల్చేసిన పిచ్చి పువ్వులా...అనిపించింది...

అతనికి ఆ ఒంటి గదిలో తన్ను కుంటున్నట్టుగా వుంది. చిలక పంజరంలో చిక్కుకుని సతమతమవుతున్నట్లుగా వుంది.

"ఇక్కడొద్దు...అన్నాడు మెల్లిగా

"మరి? అన్నట్లు ఆ కోలకళ్ల అరవాల్చి పల్చగా నవ్వుతోంది

"కూచోండి. ఒక్క క్షణం" అంటూ నవ్వి లోపలికి వెళ్లింది వంకీలు తిరిగిన పొట్టిజడ

నిట్టూర్పు విడిచి,

గదంతా కలియ జూస్తున్నాడు. ఓ పక్కన పట్టెమంచం, పచ్చ దుప్పటీ, దండెంమీద రెండు మూడు చీరలు. చిరిగిన ఓ లోపావడా, బాడీ.

స్టూలుమీద రెండు పుస్తకాలు

ఒకటి చందమామ మరొకటి...

చెక్కబీరువాలో ఒందర వందరగా పడి వున్న పది పుస్తకాల్లో అతని ఫొటో వున్న పత్రిక...

వచ్చింది తెల్ల చీర కట్టుకుంది తెల్లా కాగితం పువ్వులా.. లాంతరు వెలుగులో నించుని, నవ్వుతోంది. ఇలాటి జీవితంలో ఇంత అమాయకత్వం ఎలా సాధ్యం ?

నవ్వి - "పుస్తకాలు బాగా చదువు తున్నావా ?" అన్నాడు

నవ్వింది.

"నాకూ-డా పుస్తకాలంటే పిచ్చి రచయితల్లో చాలా మంది తెలును"

ఏదో అనబోతోంది.. బయటినుంచి ఎవరో పిలిచేరు వెళ్ళింది వినిపించీ... వినబడకుండా ఏవో గొంతులు

అతని రక్తం లావాలా రేచింది లేవబోతున్నాడు

రెప్పలు వాల్చుకుని లోపలికి వస్తోంది ...రేగిన జుట్టు. చెంపమీద కమిలిన వేళ్ళ గుర్తు...

అతనికి కడుపులో దేవినట్లుగా బాధ పుట్టింది. "ఏమిటి..." అన్నట్లు జాలిగా చూసేడు

తలొంచుకుంది 'శీలా'కి స్వవిష యాలు చెప్పుకోవటం ఇష్టంలేదు

"...కాస్త ముందుకు వంగి, ఆ గూట్లో తాళం చెవి...కప్పు..."

అందుకుని ఆమె చేతికిచ్చేరు. పొడు గాటి వేళ్ళు! ఆ వేళ్ళకి మంచె అందిస్తే. పిచ్చి గీతలు—ఆమె నుదుటి గీత ల్లాగా..."

ఎక్కడో గడియారం తొమ్మిది గంటలు కొట్టింది

తాళం వేసి, తాళం చెవి చేతిలో ఉన్న పూసల పర్సులో వేసుకుని...నీలాకాశం కింద నించుని అమాయికంగా అతనికేసి చూస్తోంది...

"గోదావరి గట్టున కూచుందాం..."

చిత్రంగా చూసి తలూపింది

—అతను రచయిత జీవితంలో కొన్ని వందలమందిని చూసేడు. కొన్ని వేల కథలు విన్నాడు కొన్ని లక్షల కన్నీటి బొట్లు పరిశీలించాడు అంతటి అనుభవంతో...ఆమె జీవితాన్ని అంచనావేసి, ఆమె ఏమై వుంటుంది ? అని వూహించి...తన మేథాశక్తితో, సరదాగా ఓ కథ అల్లి చెప్పేడు.

చిత్రంగా...ఆమె 'హర్ట్' అయింది ఆ 'మధు' ఎవరో తనకు తెలుసుననీ... ఆమె గత జీవితంతో తనకు సంబంధం వున్నదనే అనుకుంటోంది

ఎవరీ మధు ? మధు కలశాన్ని లాగి తన్నుకోగల దురదృష్టవంతుడు ఎందు కయేడు ? ఎలా అయేడు ?

ఆమె చెప్పదు !

తెలుసుకుంటే తప్ప—అతినికి మన శ్శాంతి లేదు !...

"పోనీ.. నేను చెప్పనా ? మధు ఏదో వుద్రేకంలో అందర్నీ వదులుకుని నీ వెంట వచ్చేసాడే గానీ...కొద్దిరోజులు గడిచేసరికి మొహం మొత్తింది. మోహం తీరి నీ..ఇక, నీ దారి నీది—నా దారి నాది—అంటూ రెక్కలు కొట్టుకుంటూ తన మానాన తను ఎగిరిపోయేడు..."

"కాదు..." అన్నట్లు తల తిప్పింది. అతను ఓ క్షణం ఆలోచించాడు

"—ఎక్కడో వున్న మధు తల్లి దండ్రులకి ఈ సంగతి తెలిసింది వచ్చి, కొడుకుని మందలించేరు వచ్చెయ్యమన్నారు

ప్రేమిస్తాడు. మనసిస్తాడు. బాసలు చేస్తాడు ఆమె తనకు ప్రాణం తన వూపిరి ఆమె లేకపోతే...తను పిచ్చి వాడయి పోతాడు !

ఒకరోజు వస్తుంది నాన్న తుపాకీ తీస్తాడు అమ్మ ఏడుస్తుంది. చెల్లెలు దిగాలు పడిపోతుంది. ఆకాశంనించి ఓ కాటా దిగి వచ్చి—ముందు నించుంటుంది. ఓ వేపు అమ్మా, నాన్నా కన్నీళ్ళూ...ఓ వేపు ప్రేమా, ప్రేయసీ, కన్నీళ్ళూ...ఎవరు నీ వాళ్ళు ? ఇద్దరూ నా వాళ్ళే అనగల గుండె వుండదు. ఎదిరించలేడు తనకు కావలసినదేవిఁటో చేయి చాచి అందుకోగల చొరవ చూప లేడు పిరికివాడైపోతాడు. ప్రేమనించి, సమస్యనించి, జీవితాన్నించి...పలాయనం చిత్తగిస్తాడు.

"లేదు...మధుకి అమ్మా, నాన్నా, అయినవాళ్ళూ ఎవరూ లేరు ఏకాకి..."

మరి ?

అతనికి మతి పోతోంది.

సమాజం మొత్తం పరిశీలించి వందల

కొద్దీ కథలు వ్రాయగలిగిన అతనికి ఓ ఆడపిల్ల జీవితాన్ని అంచనా వేయలేక పోతున్నానే అన్న బాధ ! ఓడిపోతున్నా నేమో...అన్న భయం !

ఆఖరి బాణం వదిలేడు !

"అంతవరకు ఐశ్వర్యాల మధ్య పెరిగిన నీకు, మధూతో పంచుకొన్న చిన్ని జీవితం నచ్చలేదు. విలాసాలు కావాలి ! అతన్ని చిత్రవధ చేసేవు. హింసించేవు చివరికి మధూని ఇంటినుంచి వెళ్ళగొట్టేవు ! మధుఫలం అనుకుని దీపం ఒగ్గిరికి పరుగెత్తిన రెక్కల పురుగులా-" అతను ఆగేడు

'ఆమె' బరస్ట్ అయింది. బావురు మంది కొంతసేపటికి కోలుకుంది

తరువాత జరిగిన కథ చెప్పింది

...ఇక రెండు రోజుల్లో తన పెళ్ళికి ముహూర్తం పెడతారనగా, ఆ రోజు రాత్రి మధూ తను కలిసి వెళ్ళిపోవడానికి నిశ్చయం చేసుకున్నారు రాత్రి అందరూ నిద్రపోయిన తర్వాత ... కొట్టుకుంటున్న గుండెలతో మంచంమీద లేచి కూచుంది...ఆ వూరుకి తన తండ్రి మకుటం లేని రాజు మోతుబరి ఈ తన ప్రయత్నాన్ని ఇంట్లో ఏమాత్రం పసి కట్టినా, చంపేస్తారు !...

మధు లేని తనకి ఈ బ్రతుకెందుకు!

వణుకుతున్న చేతులతో ఎలాగో ఓ చీటీ రాసి, టేబుల్‌మీద పెట్టి సూట్ కేసులో రెండు గుడ్డలు పడేసుకుని దొడ్డి గుమ్మంలోనుంచి ఇవతలికి వచ్చింది రోడ్డు దాటి, చీకట్లో పొలాలకి అడ్డంపడి స్టేషను వేపుపరిగెత్తింది...

టైమెంతయిందో తెలీదు. మధు వచ్చేడో, ఎక్కడున్నాడో.. అంత కన్నా తెలీదు ! ఎవరో తెల్లబట్టల్లో వున్న ఆసామీ చుట్ట కాల్చుకుంటూ పక్కనించి పోతున్నాడు ముఖం కనబడకుండా చీకట్లోకి లాక్కుని, టైమడిగింది.

పదిమీద, ఓ ఐదు !

తామిదరూ పదకొండు గంటలకి స్టేషన్లో కలుసుకోవాలనుకున్నారు మధు తమ ఇంటి దగ్గిరికి వచ్చి నుంచుంటా నన్నాడు తనే, ఎవరన్నా చూస్తే ప్రమాదం...వద్దంది. 'విధి' వద్దంది

కాలాన్ని కళ్ళతో కొలస్తూ.. భయంగా ఓ మూల ఒదిగినించుంది

ఏదో బండి కూతపెట్టుకుంటూ అటువేపు నించి వచ్చి ఆగింది ఓ ముసలాయనా, అవ్వా, నలుగురైదుగురు యువకులూ, ఓ కళ్ళీ లాల్చీ, చంటిపాపని ఎత్తుకున్న ఓ యువతీ కిందికి దిగారు ఆఖర్న— పంచకట్టు బుంగమీసాలూ... చేతిలో చేసంచీ...

కెవ్వున గుండె గావుకేక పెట్టి— బ్రతికుందో చచ్చిపోతోందో.. తెలీని స్థితిలో అందుబాటులోవున్న ఓ పెట్టి లోకి గెంతి, లోపల గడియ పెట్టేసుకుని, స్పృహ తప్పి పడిపోయింది.

తెలివి వచ్చేసరికి, వెలుగు వచ్చింది

జరిగినదంతా గుర్తొచ్చింది గజగజా వణికిపోతూ...బావురుమని ఏడ్చుకుంది అమ్మ గుర్తొచ్చింది నాన్న గుర్తొచ్చారు. నాన్న...రాత్రి స్టేషన్లో తను ఆయన కంటపడివుంటే?...

—మధు ఏమయ్యేడు భగవాన్?

...రాత్రి స్టేషనుకు వచ్చి, తను కనబడకపోవటంతో క్రుంగిపోతాడు తనను మోసగత్తె అనుకుంటాడు బాధతో, కోపంతో ఇంటికి వెళ్ళిపోతాడు పిచ్చివాడయిపోతాడు...

తెల్లవారేసరికి తను కనబడటం లేదన్న వార్త తెలుస్తుంది బహుశః తెలీదు తమలాటి పెద్ద ఇళ్ళల్లో జరిగే సంఘటనలు అంత గప్పున బయటికి తెలియనీయరు. కప్పిపెట్టి, ఈపాటికి తనవాళ్ళంతా కత్తులూ కరార్లూ పుచ్చుకుని తనకోసం వేటకు బయలుదేరుతారు చీటిలో తను మధూ పేరు రాసి వుంటే?...

ఎవరో తలుపు తడుతున్నారు...

మృత్యువా..? మృత్యువా...?

టికెట్ కలెక్టర్

ఏదో చెప్పి, అతను చెప్పినదంతా పర్సులోనుంచి లాగి చేతిలో పెట్టింది

"ఎక్కడికి?"

ఎక్కడికో తనకి తెలీదు...పక్క స్టేషన్కి—

హైద్రాబాద్! ఎలాగో ఓ మారుమూల హోటల్ గదికి పిచ్చుక పిల్లలా రెక్కలు కొట్టుకుంటూ...పారిపోయి, కవరు తెప్పించుకుని జరిగినదంతా చెబుతూ వెంటనే బయలుదేరి రమ్మని తనకు చాలా భయంగా వుందని... మధూకి వుత్తరం రాసింది

క్షణాలు కొలుచుకుంటూ...

కన్నీళ్ళు తుడుచుకుంటూ...

గా! సవ్వడికి...తుళ్ళి.. తుళ్ళి... పడుతూ—

కన్నీళ్ళు ఐపోయేయి కాలం చచ్చిపోయింది!...

మృత్యువు నోటినించి బయటపడి... నెల దినాల తర్వాత కళ్ళు విప్పేసరికి—

డాక్టరు బిల్లు—వందరూపాయిలు,

హోటల్ వాడికి—నూటయాభై!

తన ఒంటిమీద వున్న ఒక్క దుద్దుల జతా అమ్మితే — వందమీద, ఓ పాతిక...

...జీవితంలో తారసిల్లిన మనిషి—బాసలు చేసి, శపథాలు చేసి, చివరికి... నడిసముద్రంలో వదిలేసి......తన మానాన తను ఎగిరిపోతే...ఐదో తరగతి చదువుకున్న ఓ ఆడపిల్ల...దిక్కులేని ఓ పిచ్చి పువ్వు ..

...ఇంతకన్నా ఏంచేస్తుంది?

ఏం చేయలేదా...ఏం చేయలేదా...

. ఏం చేయాలని తను కథల్లో చెప్పేదో గుర్తులేదు ఆమె కన్నీటికి అంతం లేదు ..! అంత ప్రేమించి, విలపించి,

ఆమెకోసం పిచ్చివాడయిపోయిన మధూ...నీలాని అంత దౌర్భాగ్య పరిస్థితిలో వదిలేసి వూరుకున్నాడని అనుకోవడానికి మనసు ఒప్పుడంలేదు...

ఓవేళ—మధూకి ఆ వుత్తరం అందలేదేమో !

గప్పున తలెత్తింది. పిచ్చిచూపులు...

"అవునమ్మా ! అంత ప్రేమతో, ఆరాధనతో నీ కోసం మతి పోగొట్టుకున్న మధు—నీ వుత్తరం అందిన మరుక్షణం రెక్కలు కట్టుకుని నీ దగ్గిరికి వచ్చి వాలేవాడు ఒకసారి ఇలాగే నా ఫ్రెండొకడు తమ వివాహ విషయంలో తన ప్రియురాలు వ్రాసిన వుత్తరం అతనికి అందలేదు దాంతో...ఆమె అతన్ని అపార్థం చేసుకుని, వేరొకర్ని పెళ్ళి చేసేసుకుంది !...

ఆ మరునాడు బయలుదేరి రాజా తమ వూరు వచ్చేసేడు ఆమె తన పాఠకురాలు నీలానో...కాదో అతనికి తెలీదు తెలుసుకోవాలన్న 'కోరిక' లేదు

'నీలా' అతనికి ఓ బాధ ! ఓ బంధం ! 'మధు' ఏమయ్యేడు అన్నది అతనికి అర్థంకాని—ఓ వేదన !...

* * *

రాత్రి పన్నెండు గంటలయింది.

"సమాప్తం" అని వున్న ఆఖరు పేజీ పూర్తిచేసి, పుస్తకం టేబుల్ మీదకి విసిరి "అమ్మయ్య" అనుకుంటూ...కళ్ళు మూసుకుంది నీలా

మనసంతా నవలలో వున్న విషాదానికి వలించి...భారంగా తయారయింది మాటి మాటికీ కథలోవున్న 'కాదంబరి' దయనీయమైన రూపం కళ్ళముందు కదులుతూ హృదయాన్ని వేదనతో నింపుతోంది...

లేచి, కూజాలో వున్న నీళ్ళు గ్లాసులో వొంపుకుని తాగి, టేబుల్ సొరుగులోంచి కాగితం, కలం తీసుకుని—ఆ పుస్తకం రాసిన తన అభిమాన రచయిత రాజుకి వుత్తరం రాయటం మొదలు పెట్టింది...

ఇవాళ ఈ నవల కొనుక్కోవడానికి తను యజ్ఞంచేయాల్సివచ్చింది పాపం అమ్మా నాన్నా మంచివాళ్ళే! ఏవో చిన్న చిన్న పత్రికలూ అవీ కొంటూనే వుంటారు. ఈ కరువురోజుల్లో అంత లేసి డబ్బులుపోసి అన్ని పుస్తకాలూ కొనుక్కోగలగటం తమలాటి మధ్యతరగతి కుటుంబీకులకి సాధ్యంకాని పని. తను మాత్రం అన్ని పుస్తకాలూ కొని పెట్టమని ఎప్పుడన్నా అడిగిందా ! కాని... 'రాజా' పుస్తకాలు చదవకపోతే మాత్రం... తనకి మతిపోతుంది. ఆయన తన అభిమాన రచయిత ఎంచక్కానో, గొప్పగా రాస్తాడు ప్రపంచంలోవున్న ఆకలీ... అన్యాయం... కన్నీళ్లూ... అన్నిటి గురించీ కూలంకషంగా చర్చిస్తూ ఆవేదనతో రాస్తాడు అలాటి చర్చలు అంటే తనకి మొదటి

సెంటీ ఇష్టం. విషాదగాథల్ని వింటే తను చలించిపోతుంది. ఆ విషాదానికి కారకులైన మనుషులమీదా...ప్రపంచం మీదా కోపం వస్తుంది 'కల్యాణి' చదివి నప్పుడు తనకి అలాగే కోపంవచ్చింది ఏడుపొచ్చింది. ఆ కోపంతో, బాధతో వెంటనే కాగితం కలం తీసుకుని ఆ రచయితని చెడామడా దులిపేస్తూ వుత్తరం రాసేసింది. తన వ్రాతలు చదువుకుని ఆయన ఏమనుకుని వుంటారు?తనని తిట్టుకుంటారా? తిట్టుకోనీ. తనకేం భయం లేదు. తను తప్పేం రాయలేదు తను ఎంతమంది రచయితల్ని చూడలేదు? అందరూ పతితలగురించీ పేదలగురించీ గుండెలు బాదుకునేవాళ్ళే ఉపన్యాసాలు ఇచ్చేసేవాళ్ళే, గాంధీకీ, వీరేశలింగానికీ కూడా... మంచి సాంప్రదాయసిద్ధమైన... పతివ్రతలైన భార్యలున్నారు కనీసం మనకున్న రచయితల్లో సగం మంది ఒక్కొక్కళ్లూ ఒకో పాపపంకిలంతో వున్న స్త్రీని తమ జీవితంలోకి ఆహ్వానించి వుంటే...సమాజం ఇలావుండదు ఈ విషాదం వుండదు 'కల్యాణు ల బ్రతుకుల్లో "కన్నీళ్లు" వుండవు...

తన వ్రాతలకి రాజుగారు ఎలాటి సమాధానాలు చెబుతారో వినాలని ఎంతో కుతూహలంగా వుంటుంది. కాని . తనకా అదృష్టం లేదు. అమ్మా నాన్నా- ఓ పరాయి పురుషుడితో తమ కూతురు కలంస్నేహం చేయడానికి ఒప్పుకోరు రచయిత మాత్రం మగాడు కాదూ? అంటారు. తిడతారు, నానా రభసా చేస్తారు. అంచేత, తను మాత్రం వుత్తరాలు రాస్తూ... ఎవరూ చూడకుండా రహస్యంగా వుత్తరాలని పోస్టుచేస్తుంది.

నీలాకి తన అభిమాన రచయితతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుకునే ధైర్యం లేదు-

రచయితలకి తమ కథల్లో వర్ణించే ఆశయాలు నిజజీవితంలో ఆచరించే ధైర్యంలేదు. 'లేదు' అనే పదం మన రక్తనాళాల్లో వుంది మన బ్రతుకుల్లో వుంది. మన ఆలోచనల్లో వుంది లేని దెక్కడ?-

తను అన్నం మానేస్తే మాత్రం అమ్మా నాన్నారూ తల్లడిల్లిపోతారు పోనీ... బయటికి వెళ్ళి ఏదన్నా తినమని నాన్నారు డబ్బులిస్తారు ఆ డబ్బులన్నీ పోగేసి, తను రాజు పుస్తకాలన్నీ కొనుక్కుంటుంది

పదిహేడేళ్ల 'నీలా' ఆ చిన్నగదిలో టేబుల్ముందు కూచుని కాగితం కలం తీసుకుని... తను అప్పుడే ముగించిన 'అగాధాలు' నవలగురించి, తమ అభిమాన రచయిత రాజుకి వుత్తరం రాయటం మొదలుపెట్టింది...

*　　*　　*

ఆర్నెల్ల తర్వాత- ఓ సంఘటన జరిగింది.

రాజు భార్యనీ, మూడేళ్ల కొడుకునీ తీసుకుని ఓ ఫ్రెండు ఇంటికి 'టీ' కి వెళ్ళేడు

కాఫీలు అయింతర్వాత అంతా కబుర్లు చెప్పుకుంటూ తోటలో కూచున్నారు.

దేవి ఆల్బం పట్టుకొచ్చి అందరికీ చూపిస్తూ ఎవరెవరో వివరిస్తోంది ఉన్నట్టుండి, రాజు తుళ్ళిపడ్డాడు చూపులు ఓ.ఫొటోమీద నిలిచిపోయేయి

"ఎవరీ అమ్మాయి?" అన్నాడు

దేవి దిగాలుపడిపోయింది. కళ్లలో నీళ్ళు తిరిగేయి

తన స్నేహితురాలు 'నీలమణి' ప్రేమకథ చెప్పింది...

"నీలమణీ... మధూ... కలిసి వెళ్ళిపోయేరని అప్పుడు అంతా అనుకున్నాం..! కాని... ఏమయిందో తెలీదు మధూ ఒక్కడూ ఎందుకు తిరిగొచ్చేడో తెలీలేదు...

మూడోనాటి మధ్యాహ్నం అతనికి ఎక్కణ్ణించో ఓ పుత్తరం వచ్చిందిట అప్పటికే... మధూకి ఒళ్లు తెలియని జ్వరం ఆ వుత్తరం చూస్తూనే కంగరుగా సూట్‌కేసు సర్దేసుకుని, తన అర్జంటుగా బయలుదేరి 'హైద్రాబాద్' వెళ్లాలనీ... అతను అడిగిన పుస్తకాలు తర్వాత ఇస్తాననీ... అక్కడే వున్న ఇంటివారబ్బాయితో చెప్పి, హడావుడిగా బయలుదేరి వెళ్లిపోయేడుట...

స్టేషను చేరేసరికి... రైలు కదులుతోంది మధూ పిచ్చిగా ముందుకు పరుగెత్తి, ఇనపకడ్డీ అందుకోబోయేడు అంతలోనే బేలన్స్ తప్పి— పట్టాలమధ్య పడి...

* * *

...అదే సమయంలో రాజమండ్రీ స్టేషన్లో రైలగేటు పక్కన నించుని... కాగితం ముక్కలు అందరికీ పంచిపెడుతూ పకపకా నవ్వుతోంది ఓ పిచ్చిది.

అంతలోనే జుట్టు పీక్కుంటూ గట్టిగా ఏడుస్తోంది...

"వుత్తరం అందలేదు... అందితే రాడూ...?. వుత్తరం అందలేదు"